**ఎంపీ వద్దిరాజు రవిచంద్ర** అలియాస్ గాయత్రి రవి.. ప్రస్తుతం ఈ పేరు తెలియని వారు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో ఉండరంటే అతిశయోక్తికాదు. ఎందుకంటే పేదల కష్టాల్లో తాను పాలుపంచుకుంటూ నిత్యం దాన ధర్మాలతో సాయం చేస్తూ అన్ని సామాజిక వర్గాలకు చెందిన ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్న ఆయన తనకు సీఎం కేసీఆర్, యువనేత కేటీఆర్ ఇచ్చిన రాజ్యసభ సభ్యుని(ఎంపీ) పదవికి వన్నె తెస్తూ వారి ఆలోచనలకు అనుగుణంగా ముందడుగు వేస్తున్నారు. ప్రధానంగా బీఆర్ఎస్‌లో నియోజకవర్గానికి రెండు గ్రూపులతో తలనొప్పిగా మారిన పరిస్థితుల్లో కేసీఆర్, కేటీఆర్ ఆశీస్సులతో బీఆర్ఎస్‌లో అసమ్మతిని సమూలంగా మార్చేసి వర్గపోరును చక్కదిద్దే బాధ్యతలు ఎంపీ వద్దిరాజుకు అప్పగించారన్న టాక్ వినిపిస్తోంది. సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ ఖమ్మం ఉమ్మడి జిల్లాలో ట్రబుల్ షూటర్ రూపంలో ఎంపీ వద్దిరాజు పనిచేస్తున్నారన్న చర్చ రాజకీయ వర్గాల్లో ఊపందుకుంది. సాధ్యమైనంత మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని బీఆర్ఎస్ నాయకులను ఐక్యం చేసే బాధ్యతలు తీసుకుని సైలెంట్‌గా అండర్ కవర్ ఆపరేషన్‌లో నిమగ్నమయ్యారు. ఎంపీగా తనకు అంది వచ్చిన అవకాశాన్ని సధ్వినియోగం చేసుకుని అతితక్కువ కాలంలోనే అందరివాడిలా గుర్తింపు పొందిన ఎంపీ వద్దిరాజుకు మరిన్ని కీలకబాధ్యతలు అప్పగించారన్న చర్చ జరుగుతుండటం విశేషం. సౌమ్యునిగా, కొన్ని కీలక అంశాల్లో తన మాట తీరుతో ఎదుటి వారికి నచ్చజెప్పి మెప్పించే నేర్పరిగా పేరున్న ఆయనకు గులాబీ దళపతి కేసీఆర్ కొన్ని ప్రత్యేక బాధ్యతలు అప్పగించినట్టు తెలుస్తోంది.

వనం నాగయ్య (కెరటం న్యూస్ ప్రత్యేకం)




# ట్రబుల్ షూటర్‌గా ఎంపీ వద్దిరాజు

## అనతికాలంలోనే అందరివాడిలా గుర్తింపు

## కేసీఆర్, కేటీఆర్ మాటే శిరోధార్యం

- ఎంపీగా తన మార్కు చూపుతూ ప్రజలతో మమేకమై ముందడుగు
- బీసీ సంఘం పెద్ద దిక్కుగా, మిగతా సామాజిక వర్గాలకు దగ్గరైన ఎంపీ
- జిల్లాలో కీలక బాధ్యతలు అప్పగించిన కేసీఆర్, కేటీఆర్..?
- బీఆర్ఎస్‌లో ఇంటి పోరును చక్కదిద్దే కీలక బాధ్యతల్లోకి రాజ్యసభ సభ్యుడు

### ఇంటి పోరును చక్కదిద్దే కీలక బాధ్యతలు..?

ఇంటిపోరుతో, వర్గపోరుతో సతమతమౌతున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్‌ను సమన్వయ పరిచే కీలకబాధ్యతలు ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు అప్పగించారనేది విశ్వసీయ సమాచారం. ప్రస్తుతం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ గురించి చెప్పాలంటే ఒక ప్రత్యేక పరిస్థితిని ఎదుర్కొంటోంది. ముఖ్యంగా ఒక్కో నియోజకవర్గానికి ఇద్దరేసి నాయకులు పోటీకి కాలుదువ్వుతున్నారు. వచ్చే ఎన్నికల్లో తామంటే తామే పోటీచేస్తున్నామని ప్రకటించుకుంటూ నియోజకవర్గాల్లో పర్యటన చేస్తూ ఎవరి దారి వారిదేనన్నట్టుగా కార్యకర్తలను సమీకరిస్తున్నారు. నియోజకవర్గాల్లో పర్యటనలు కూడా చేస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రజల్లో మంచి పట్టున్న నాయకునిగా పేరున్న మాజీ ఎంపీ పొంగులేటి ఇటీవల బీఆర్ఎస్‌పై తిరుగుబాటు జెండా ఎగురవేయడంతో పాటు బీఆర్ఎస్‌లోని కొందరు ముఖ్యులను తన వైపుకు తిప్పుకోవడంతో బీఆర్ఎస్‌లో గందరగోళానికి దారి తీసింది. ఒక విధంగా పొంగులేటి పార్టీ మారుతున్న వ్యవహారం బీఆర్ఎస్ అధినేతకు సైతం తలనొప్పిగా మారడంతో మరికొందరు పొంగులేటి గూటికి చేరకుండా చూడటంతో పాటు, సమన్వయ పరిచేలా బాధ్యతలు అప్పగించారనీ, మంచి సౌమ్యునిగా పేరున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కీలక అంశాలను చక్కదిద్దే బాధ్యత తన భుజానికెత్తుకున్నారనేది ప్రస్తుతం వినిపిస్తోన్న టాక్.



### మంత్రి పువ్వాడ నియోజకవర్గం మినహా అంతటా గందరగోళమే..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాల్లో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం నియోజక వర్గం మినహా దాదాపు తొమ్మిది నియోజక వర్గాల్లోనూ బీఆర్ఎస్ తీవ్రమైన వర్గపోరుతో గడ్డుపరిస్థితిని ఎదుర్కొంటోంది. ఖమ్మం నియోజకవర్గాన్ని చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో







అభివృద్ధి పరుస్తున్న మంత్రి పువ్వాడ కృషి అమోఘమనే చెప్పాలి. ఇక పోతే ఇప్పటికే 2014, 2018 శాసనసభ ఎన్నికల్లో పది నియోజకవర్గాలకు గాను తొమ్మిదింట పరాజయాన్ని మూటగట్టుకున్న బీఆర్ఎస్‌కు మరి కొద్ది నెలల్లో కీలకమైన అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో ఇంటి పోరును చక్కదిద్దక పోతే మళ్లీ పరాభవం తప్పదన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పదికి పది అసెంబ్లీ స్థానాలు గెలుచుకోవడానికి, మాజీ ఎంపీ పొంగులేటి ప్రభావాన్ని అడ్డుకునేందుకు బలమైన బీసీ సంఘానికి ప్రతినిధిగా ఉన్న వద్దిరాజు రవిచంద్ర ఒక పక్క ఎంపీగా తన ప్రస్థానాన్ని ముందుకు తీసుకెళుతూ, మరోపక్క జిల్లాలోని పలు సున్నితమైన అంశాలను చక్కదిద్దే కీలకబాధ్యతల్లో ఉన్నట్టు సర్వత్రా చర్చ జరుగుతోంది.

## ఖమ్మంలోనే బీఆర్ఎస్ ఆవిర్భావ సభ సక్సెస్ మంత్రం..

ఇటీవల టీఆర్ఎస్ పార్టీ నుండి బీఆర్ఎస్ గా మారిన నేపథ్యంలో ఖమ్మం వేదికగా నలుగురు ముఖ్యమంత్రుల సమక్షంలో బీఆర్ఎస్ భారీ జాతీయ సభ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సభ నిర్వహణ మెత్తం కూడా మంత్రి హరీశ్‌రావు బాధ్యతలు తీసుకున్నారు. దాదాపు పదిరోజుల పాటు మంత్రి హరీశ్‌రావు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఇంట్లోనే ఉన్నారు. వద్దిరాజు నివాసకేంద్రం నుండే బీఆర్ఎస్ సభ సక్సెస్ మంత్రం నడిచింది. ఉమ్మడి జిల్లాలోని అందరు ఎమ్మెల్యేలు సమన్వయం చెయ్యడంతోపాటు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆర్థికంగా అండగా నిలిచారన్నది తెలిసిందే. ఈ పరిస్థితుల్లో బీఆర్ఎస్ సభ విజయవంతం కావడంతో కేసీఆర్, కేటీఆర్ ఎంపీ వద్దిరాజును మరింత క్రియాశీలక బాధ్యతల్లో ఉంచారు.

## అనతికాలంలోనే అందరివాడిలా..

తొలుత కాంగ్రెస్ పార్టీలో తన రాజకీయ ప్రస్థానాన్ని ఆరంభించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సీఎం కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆహ్వానం మేరకు బీఆర్ఎస్‌లో చేరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ బీసీ సంఘం పెద్దదిక్కుగా, పేదల పెన్నిధిగా, రాజకీయ నాయకునిగా, గ్రానైట్ వ్యాపారిగా వివిధ కోణాల్లో ఎంపీ వద్దిరాజుకు ప్రజల్లో మంచి పేరుంది. ఎవరు ఏ ఆపదలో ఉన్నా వెంటనే స్పందించి, వారి కష్టాల్లో పాలుపంచుకుంటూ ఆర్థిక సాయంతో పాటు దానధర్మాలతో వద్దిరాజు రవిచంద్ర తన కంటూ రాజకీయాలకు అతీతంగా ఒక గుర్తింపును కలిగి ఉన్నారు. ఈ క్రమంలోనే సీఎం కేసీఆర్ మనసు గెలిచి ఎకా ఎకిన ఎంపీగా అవకాశం దక్కించుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రజా సమస్యలను అధినేత కేసీఆర్ దగ్గర వివరించడంతో పాటు ఆయా సమస్యల పరిష్కారంలో తనవంతుగా వేగంగా కృషిచేస్తూ ప్రజానాయకునిగా గుర్తింపు పొందారు. ఈ క్రమంలోనే ఇటీవల జరిగిన హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికల్లో సీఎం కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎంపీ వద్దిరాజుకు కీలక బాధ్యతలు అప్పగించి మంచి ఫలితాలు రాబట్టినట్టు తెలుస్తోంది. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలమైన సామాజిక వర్గంగా పేరున్న కాపు సామాజిక వర్గానికి చెందిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తన సామాజిక వర్గాన్ని బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారుస్తూ, మిగతా సామాజిక వర్గాలతో కలివిడిగా, అందరివాడిలా సమన్వయ కర్తగా ఉంటూ ప్రత్యేక పంథాలో పయనిస్తూ బీఆర్ఎస్ బలోపేతానికి విశేషంగా కృషిచేస్తున్నారు. హైదరాబాద్, ఢిల్లీకి మాత్రమే పరిమితం కాకుండా వీలు దొరికినప్పుడల్లా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉంటూ ప్రజలకు మరింత దగ్గరవుతున్నారు.

